27032025-DIS-04_Layout 1 3/27/2025 2:37 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

ఎగుమతుల నేలచూపులు

ప్రధానిగా దేశ పగ్గాలు చేపట్టిన తర్వాత కొన్నాళ్ల పాటు 'మేకిన్ ఇండియా' అంటూ మోదీ పదేపదే వల్లె వేశారు. దిగుమతులు తగ్గించుకొని స్వదేశీ సరుకుల తయారీని పెంచడం ఈ నినాదం లేదా పథక పరమోద్దేశం. తద్వారా దిగుమతులు తగ్గించి ఎగుమతులను పెంచడం లక్ష్యంగా దీన్ని తెరమీదికి తీసుకువచ్చారు. పారిశ్రామికతకు ప్రతీకల్లాంటి పండ్ల చక్రాలతో కూడిన సింహం బొమ్మ దీనికి చిహ్నంగా వాడుకున్నారు. అంటే, ఇండియా ప్రపంచంలో మృగరాజులా రెచ్చిపోతుందనుకోవాలన్న మాట. కానీ, ఇప్పుడు ఆ సింహం పెద్దగా ఎక్కడా కనిపించడం లేదు. ఇక ఎగుమతుల్లో భారత్ పైపైకి దూసుకుపోవడం మాట దేవుడెరుగు, నానాటికీ తీసికట్టు అవుతుండటం మనం ఇప్పుడు చూస్తున్నాం. ప్రపంచ ఎగుమతుల్లో స్వాతంత్ర్యం వచ్చేనాటికి మన దేశం వాటా 2.2 శాతమైతే ఇప్పుడది 1.6 శాతానికి పడిపోయింది. ఇది యాభై ఏండ్ల కనిష్ఠం కావడం అనేది మోదీ ప్రభుత్వ పనితీరుకు అద్దం పడుతున్నది. స్థూలంగా చూస్తే ఇదివరకటి మన్మోహన్‌సింగ్ ప్రభుత్వ హయాంలో ఎగుమతుల్లో సాధించిన వృద్ధి ఎంతో నయంగా ఉండటం గమనార్హం.

మేకిన్ ఇండియా ఊరించినట్టుగా ఇండియా ప్రపంచంలో తనదైన ప్రత్యేక మార్కెట్‌ను కల్పించుకోవడంలో ఘోరంగా విఫలం కావడమే అందుకు కారణం. పెట్టుబడుల గమ్యంగా తన స్థానాన్ని కూడా భారత్ నిలబెట్టుకోలేకపోయింది. విదేశీ పెట్టుబడులు అడ్డూ అదుపూ అనేది లేకుండా ఎగిరిపోతుండటంతో డాలర్‌ను తట్టుకోలేక రూపాయి రోజురోజుకూ చిక్కిశల్యమై పోతున్నది. రూపాయికి పూర్వవైభవం తెస్తానని ప్రధాని మోదీ ఘనంగా ప్రకటించారు. కానీ, ఇప్పుడది చరిత్రలో ఎన్నడూ దిగజారనంత లోతులకు పడిపోతున్నది. ఉత్పాదకతతో అనుసంధానించిన ప్రోత్సాహకాల పథకం (పీఎల్‌ఐ) కేంద్ర ప్రభుత్వ పారిశ్రామికరంగ వైఫల్యాలకు మరో ఉదాహరణగా నిలుస్తుంది. ఉత్పాదకతను జీడీపీలో 25 శాతం పెంచేందుకు 2020-21లో ఆడంబరంగా ప్రారంభించిన పథకం సాధించింది శూన్యం. జీడీపీలో ఉత్పాదకత వృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా 15-17 శాతంగా ఉండిపోయింది. ఈ పథకానికి కేటాయించిన నిధుల్లో 8 శాతం మాత్రమే వినియోగించుకోవడం కేంద్రం చేతగానితనం తప్ప మరొకటి కాదు. దీంతో ప్రభుత్వం ఈ పథకాన్ని గుట్టుచప్పుడు కాకుండా అటకెక్కిస్తున్న సూచనలు కనిపిస్తున్నాయి. అదే చైనా, వియత్నాంలు జీడీపీలో ఉత్పాదకత వృద్ధి వరుసగా 26 శాతం, 24 శాతం సాధించినట్టు ప్రపంచ బ్యాంకు లెక్కలు తెలియజేస్తున్నాయి.

ఇలా వరుస వైఫల్యాల నేపథ్యంలో మోదీ ప్రభుత్వం ఉత్పాదకతను పెంచుకునేందుకు చేస్తున్న అరకొర ప్రయత్నాలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రూపంలో గండం వచ్చి పడింది. పోటా పోటీ టారిఫ్‌లతో ప్రపంచ వాణిజ్య యుద్ధానికి అమెరికా శంఖం పూరించడంతో ఇండియా పరిస్థితి మరింత బలహీనపడింది. ట్రంప్ బెదిరింపులకు తలొగ్గి మోదీ అమెరికా ఉత్పత్తులపై సుంకాలు తగ్గించుకునేందుకు కసరత్తు చేస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఇదే జరిగితే భారత ఎగుమతులపై మరింతగా ప్రభావం పడుతుంది. ఇలా ఉత్పాదన, ఎగుమతుల్లో భారత్ ఘోర వైఫల్యాలను చవిచూస్తుంటే మోదీ సర్కారు మాత్రం 'మేకిన్ ఇండియా' విజయవంతమైనట్టు మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నది. విపక్షాల విమర్శలకు ఎగవేత తరహాలో సమాధానాలిస్తున్నది. వాస్తవ పరిస్థితి మాత్రం మరోలా ఉన్నది. ప్రభుత్వం ఇప్పటికైనా మేలుకొని దిద్దుబాటు చర్యలు చేపట్టకపోతే పారిశ్రామిక ప్రగతి, తద్వారా ఎగుమతుల వృద్ధి తీవ్రంగా దెబ్బతింటాయని చెప్పక తప్పదు.

రాజకీయ క్రీడలు-వ్యవస్థా హననం

కనకదుర్గ దంటు
89772 43484

'అ' అనే అక్షరం వర్ణమాలికలో అత్యంత ముఖ్యమైనది. ఎందుకంటే మనుష్యులు చేయగలిగిన, చేసే అత్యాచారాలన్నీ 'అ' అక్షరంతోటి మొదలయ్యే పదాలలో వర్ణించవచ్చు. 'అద్భుతం, అనిర్వచనీయం' వంటి సకారాత్మక పదాలున్నా 'అ/అన్' అనే పూర్వ పోషితాలు (ఇంగ్లీషు పదం ప్రిపోజిషన్, సంస్కృతం నుంచే గ్రహింపబడినది) కొన్ని పదాలకు వ్యతిరేకార్థాలు ఇవ్వగలుగుతాయి. 'అబద్ధాలు, అన్యాయాలు, అకృత్యాలు, అనర్థాలు, అక్రమాలు, అత్యాచారాలు, అభద్రత, అమంగళం, అరిష్టం, అవరోధం, అరాచకీయం, అమానవీయం' ఇంకా ఎన్నో సకారాత్మక పదాలు భాషలో ఉన్నాయి. అయితే, ఇవన్నీ కూడా ప్రోత్సహించే భయంకరమైన చర్యలకు అద్యమైన పదం 'అనృతం'. అంటే అబద్ధం. పైన చెప్పిన సకారాత్మక పదాలకు సంబంధించిన ఆలోచనలు, ఆచరణలు చేసేవారందరూ ఈ అబద్ధపు ముసుగులోనే దాక్కుంటారు.



'ఋతం' అంటే సత్యం. అందుకే వేదమంత్రాలను రుక్కులు అంటారు. దానికి నకారాత్మక ప్రిపోజిషన్ 'అన్' కలిపితే 'అనృతం' అవుతుంది. వేదాలు, సనాతన ధర్మం, హిందుత్వం అని పదే పదే వల్లించే బీజేపీకి అసలు ధర్మం అంటే తెలుసా? అధర్మ పాలనే ధ్యేయంగా ప్రవర్తిస్తున్న వారినుంచి ధర్మపాలన ఆశించగలమా? పొద్దున్నే వార్తా పత్రిక తెరిస్తే ఎవరో ఒక బీజేపీ నాయకుడు చేసిన అబద్ధపు ప్రచార ప్రయత్నం కనిపిస్తూనే ఉంటుంది. బీజేపీ కేంద్రంలో చేసే అకృత్యాల సాంద్రత పెరుగుతున్న కొద్దీ, ఈ రాష్ట్ర నాయకుల అబద్ధాల చిట్టాలు, వాటి సాంద్రత పెరుగుతూనే ఉంటాయి. కొత్తగా వచ్చిన గ్రోక్ నరేంద్ర మోదీ పాపాల చిట్టా విప్పుతుంటే, రాష్ట్ర నాయకుడు బండి సంజయ్ కేసీఆర్‌కు దొంగనోట్ల ముద్రణాలయం ఉన్నదని ప్రకటించేశాడు. అయితే, అతి సామాన్యుడికి కూడా వచ్చే సందేహం ఒకటి ఉంది. 'దొంగ నోట్ల ముద్రణాలయం' అనే వసతి ఉన్నాక, వారే ఆరోపిస్తున్నట్టు కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టులో లక్ష కోట్లు తిన్నాడనే నింద ఎందుకు మీదేసుకుంటాడు? రెండు లక్షల కోట్లు తనే ముద్రించుకోవచ్చు కదా? మహారాష్ట్రలో తమ దుష్ట రాజకీయ ఎత్తుగడ పారి షిండే అనే అనామకుడు లొంగినట్టే కవితపై కేసులతోనూ అటువంటి ప్రయత్నం చేసి బొక్క బోర్లాపడి మొహం పగులకొట్టుకున్న మోదీకి ఉద్యమ నాయకుడు, ప్రజాభిమానం చూరగొన్న కేసీఆర్ కొరుకుడు పడటం లేదు. ఉద్యమ విజయంతో ప్రజాభిమానమే కాక ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన కేటీఆర్, హరీశ్‌రావు, కవిత అందరూ తమ ప్రతిభను చాటుకొని ప్రజాసేవ చేశారు. ఇది బీజేపీకి, మోదీ-షా ద్వయానికి మింగుడుపడని విషయం.

కుటుంబపాలన అన్న వివాదం లేపారు. మరి అమిత్ షా కొడుకు, రేవంత్ రెడ్డి సోదరులు చేసిన, చేస్తున్న పనులన్నీ న్యాయబద్ధమా, వారు కుటుంబీకులు కాదా? మనీయే మంత్రంగా చేసుకున్న కుబేరులైన అదానీ, అంబానీ మోదీకి కుటుంబసభ్యుల కంటే ఎక్కువ ఆత్మీయులు కదా! తప్పుడు తీర్పులు ఇచ్చి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్‌ను కేంద్ర బీజేపీ నాయకులను కాపాడిన ఢిల్లీ అన్యాయమూర్తి దగ్గర పట్టుబడినవి ఎవరి ద్వారా వెళ్లిన ఎవరి సొమ్ము? ఈ మధ్యే పుణెలో జరిగిన ఒక యాక్సిడెంట్‌లో జడ్జి ఇచ్చిన తీర్పు అందరినీ షాక్‌కు గురిచేసింది.

చాలా ధనవంతుడైన ఒక వ్యాపారస్థుడి 17 సంవత్సరాల పుత్రరత్నం మోటార్‌సైకిల్ మీద వస్తున్న ఇద్దరు ఐటీ ఉద్యోగస్థులను తన కారుతో గుద్దితే ఆ ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే చనిపోయారు. కోర్టుదాకా వెళ్లిన ఈ కేసులో జడ్జి తీర్పు ఈ విధంగా ఉన్నది. 'ఆ అబ్బాయి 300 పదాలతో యాక్సిడెంట్ మీద వ్యాసం రాయాలని, 15 రోజులు ట్రాఫిక్ పోలీసులతో పనిచేయాలని, తాగి డ్రైవ్ చేసినందుకు అతనికి కౌన్సెలింగ్ చేయాలని' ఆ తీర్పులో ఉన్నది. మూర్ఛపోకండి, వ్యాసం ఇంకా ఉంది. రూపాయి కూడా తన చేత్తో ముట్టుకోకుండా రాజకీయ వ్యవస్థలోనే కాకుండా న్యాయవ్యవస్థలో కూడా అవినీతిని పెంచిన అక్రమం బీజేపీ పాలకులది కాదా? ఇక ఈ పాపాలు లెక్కపెట్టి, బయటపెట్టే యమ ధర్మరాజు ఎలాన్‌మస్క్ చిత్రగుప్తుడి లాంటి గ్రోక్‌ను పంపి కేంద్ర బీజేపీ కూసాలను కదిలిస్తున్నాడు. అది తట్టుకోలేక ఇక ప్రతి రాష్ట్రంలో బీజేపీ నాయకులు తమ తమ బుర్రలకు పదును పెట్టి ఇతర పార్టీ నాయకులను అప్రతిష్ఠ పాలు చెయ్యాలని అవాకులు, చెవాకులు పేలుతున్నారు. ఒకవారం రోజులలో బండి సంజయ్ తన ఆరోపణకు రుజువులు చూపించకపోతే అతన్ని అరెస్టు చేసి జైలులో పెట్టాలి. ఇదీ ఇప్పుడు తెలంగాణ ప్రజలు కోరుతున్నారు.

ఇక బడే భాయ్ నుంచి అబద్ధాల మంత్రాలు నేర్చుకున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వాటికి తన అశ్లీల భాషతో మెరుగులు దిద్దుతున్నారు. సంప్రదాయకంగా ఉమ్మడి ఏపీలో జరిగినట్టు రైతుల, నేతన్నల ఆత్మహత్యలకు తోడు ఇప్పుడు ఆటోవాలాలు, మోసపోయిన నిరుద్యోగులు కూడా అదే బాట పడుతున్నారు. లీక్ చేసిన గ్రూపు పరీక్ష పేపర్ పేరుతో రచ్చ చేసిన బీజేపీ నాయకులు ఇప్పుడు 10వ తరగతి పరీక్ష పేపర్ లీక యితే కిమ్మనరు. బెట్టింగ్‌లో యువత, అత్యాచారాలలో ఆడవారు, నీళ్లు, కరెంటు లేక రైతులు, ఉపాధి తగ్గిపోయి నేతన్నలు, ఇట్లా వివిధ రంగాల వారు ఆత్మహత్యలకు పాల్పడితే, ప్రభుత్వం అస్తవ్యస్తంగా ప్రతిస్పందిస్తున్నది. 'ఎండలకు పంటలు ఎండిపోయాయన్న' అమాయకపు ముఖ్యమంత్రి మాటలు, 'ఆదివారం కాబట్టి ఇంటర్నెట్ లేదన్న' ఇంకో మంత్రి మాటలకు జనాలు నోట మాట రాక నిరుత్తరులయ్యారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎండలు కాయలేదా, లేక రైతులందరు ఎండకాలంలో పొలాలు ఇంట్లో దాచుకున్నారా ఎండిపోకుండా? అలాగే మూడో క్లాసు పిల్లవాడిని అడిగినా ఆదివారం కూడా నెట్ కనెక్షన్ ఉంటుందని ఆ మంత్రికి తెలిసేది.

తమ అధికార బలంతో కేంద్ర ప్రభుత్వం, అబద్ధాలతో రాష్ట్ర ప్రభుత్వం కొనసాగుతాయనుకుంటే అది జరుగదు. 'వినాశకాలే విపరీత బుద్ధి' అన్న సామెతకు తోడు ఇంకో నినాదం కూడా ఉంది. 'రాజకీయాలలో హత్యలుండవు, ఆత్మహత్యలే ఉంటాయి' అని! రామాయణ, మహాభారత చరిత్రలు ఎందుకు చదువాలంటే, అందులో అధర్మానికి పాల్పడినవారి గతి ఏమైందో అర్థం చేసుకోవటానికి! మహా పండితుడు, మహా భక్తుడైన రావణాసురుడి దగ్గరి నుంచి అసూయాపరుడు, అకృత్యాలు చేసిన దుర్యోధనుడి దాకా ప్రతి పాపాత్ముడూ శిక్షింపబడ్డాడు.

ఏదో ఒకటి అనాలని 'ఎండలకు పంటలెండాయి, వానలకు సామాన్యుల ఇళ్లు కూలాయి' అని అర్థం పర్థం లేని మాటలూ, ఆరు గ్యారెంటీలు అమలైపోయాయన్న అబద్ధాలు చెల్లే రోజులు ఇక పోయాయి, మత విద్వేషాలు, కులాభిమానాలు రెచ్చగొట్టి ప్రజల మధ్య చిచ్చుపెట్టి విభజించి పాలించటం ఇక చెల్లదు. అశ్లీల భాష వల్ల మాట్లాడినవారి నోరు మోరీ అవుతుంది కానీ, ఆ వాసన నిజాయితీపరుల చుట్టుపక్కలకు చేరదు. అధికారంతోనో, అబద్ధాలతోనో ఎల్లకాలం ఎవరూ రాజ్యం చేయలేరు. 'ఋతం సత్యం తన్న భవతీత్యనృతం'- అంటే సత్యం కాని అనృతం - అంటే అబద్ధం కలకాలం ఉండదు. 'సత్య్ సాధుషు భవం సత్యం' అంటే సత్యం సత్పురుషుల యందు పుట్టినది అని అర్థం. అదే 'అబద్ధం అనేది అనర్థదాయకం, ఎవరినీ మెప్పించదు, నిందార్హకం, ఉచ్చరించకూడనిది. అది కలకాలం జీవించలేదు. అంతేకాదు, కాయ పండయి చెట్టు నుంచి రాలి మనిషి చేతిలోకి వచ్చినట్టు, ఈ రాజకీయ అవినీతి, అబద్ధాల అక్రమాలు పండి, రాజకీయరంగం నుంచి గెంటివేయబడి ప్రజలతో శిక్షింపబడతారు.

'స్వకర్మ ఫ, అదబక్షణే' అంటే ఎవరికి కర్మ ఫలాలు వారే ఒంటరిగా అనుభవిస్తారు'. అప్పుడు అదానీ, అంబానీ ఆదుకోలేరు, అన్నదమ్ముల రౌడీయిజం చెల్లదు. ఇప్పుడు బీజేపీ నాయకుల అబద్ధాల పాపం కూడా నాయకుడైన నరేంద్ర మోదీ పంచుకుంటాడు. 'అయిదు ఊళ్ళు, అడగడానికి సిగ్గు లేదా, ఇస్తే ఆ ముష్టి తీసుకుంటారా' అని ద్రౌపది కోపంగా తన భర్తలను నిలదీస్తున్నప్పుడు కృష్ణుడు ఆమెను ఓదారుస్తాడు. 'యమ మహిష ఘంటికా నాదము విన తళుకొత్తెడు చిత్తముల్ గల కౌరవులు' మంచి మాటలు వినరనీ, పాండవులకు భాగం ఇవ్వరనీ, వారి నాశనం దగ్గరలోనే ఉందని ఆయన అభిప్రాయం చెప్తాడు. అలాగే దుర్యోధనుడు వంశ నాశనం కోసం పుట్టినట్టు, నరేంద్ర మోదీ భారతీయ జనతా పార్టీ అంతానికి, రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాశనానికీ అవతరించారు. కనుక, ఆ పార్టీల విధ్వంసాన్ని ఎవరూ ఆపలేరు, కురుక్షేత్ర యుద్ధాన్ని శ్రీకృష్ణుడు కూడా ఆపలేకపోయినట్టు!

రాజకీయ నాయకులు అసమర్థ పాలకులైనప్పుడు పరిస్థితులు చక్కబిడ్డటానికి మేధావులు, సామాన్యులే కంకణం కట్టుకోవాలి.

కాకి పిల్ల తన్ని పాయెరన్నా..!

"పుటికేతం పట్టి వెయి పుట్లు పండించి ఎన్నడూ మెతుకెరగరన్నా.. నేను గంజిలో మెతుకెరగరన్నా... కాల్వేయి కడుక్కోని కట్టమీద కూసుంటే కాకి దన్ని పాయెరన్నా... కాకి పిల్ల దన్ని పాయెరన్నా.' ప్రస్తుత తెలంగాణలో రైతుల పరిస్థితికి ఈ రెండు గేయరూప వ్యాఖ్యలు అద్దం పడుతున్నాయి.

ఉమ్మడి రాష్ట్రంలో చుక్క నీరు లేని చెరువులు, జీవకళ లేని నదులతో అరిగోస పడుతుంటే దశాబ్దకాలం పాటు ఉద్యమం చేసి రాష్ట్రం తెచ్చుకున్నాం. పోరాడి తెచ్చుకున్న రాష్ట్రంలో కేసీఆర్ ముందుచూపుతో ఎక్కడచూసినా జలసిరులు, రైతుల కళ్లల్లో ఆనందం కనిపించింది. చెరువులు, వాగులు, వంకలు, నదులు అని తేడా లేకుండా ప్రతిచోట నీళ్లుండేవి. కానీ, రేవంత్ రెడ్డి ప్రభుత్వ అసమర్థత కారణంగా... ఏ కట్ట మీద చూసినా ఇసుక కోసం లారీల వరుసలు కనిపిస్తున్నాయి. రైతులు నీళ్ల కోసం ప్రాధేయపడుతుంటే ఇదే అదునుగా కాంగ్రెస్ నాయకులు ఇసుక మైనింగ్‌లకు అనుమతుల కోసం హైదరాబాద్‌లో తిష్ఠ వేసి మరీ చెరువులను, నదులను చెర పట్టేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నారు.

బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో ఒక్క రైతు కూడా సాగునీటి కోసం ఆందోళన చేసింది లేదు. రోడెక్కింది లేదు. కానీ, ఒకే ఒక్క ఏడాదిలో పరిస్థితులు తలకిందులైనాయి. మళ్లీ బోరింగ్ మెషిన్లు తెలంగాణ పల్లెల్లో చప్పుడు చేస్తున్నాయి. అప్పుల కోసం రైతులు మళ్లీ బంగారం కుదువ పెట్టే పరిస్థితులు దాపురించాయి. ట్యాంకర్లతో నీళ్ల రప్పించుకొని పొలాలకు పారించే దౌర్భాగ్య పరిస్థితులను తీసుకువచ్చిన రేవంత్‌రెడ్డిని తిట్టని రైతు లేడు. వారి గోస తీర్చకపోగా వాళ్లను ఒక పార్టీకి చెందిన వాళ్లనే ముద్రేసి రైతుల ఉసురు పోసుకుంటున్నారు. రైతులనే కాదు, మహిళా జర్నలిస్టులను అరెస్టు చేయిస్తున్నాడు.

తెలంగాణ ప్రయోజనాల కోసం పోరాడేవాళ్లను రేవంత్‌రెడ్డికి ఇప్పుడే కాదు, ఉద్యమకాలం నుంచే శత్రువులుగా చూసే అలవాటుంది. సమైక్య రాష్ట్రంలో తెలంగాణను వ్యతిరేకించి చంద్రబాబు చెప్పుచేతల్లో పనిచేసిన ఆయన ఇప్పుడు అదే దారిలో వెళ్తున్నాడు. అప్పట్లో తెలంగాణ ప్రాంతాన్ని అణిచివేసి, ఇక్కడి నిధులు నియామకాలు కొల్లగొట్టిన చంద్రబాబు ఇప్పుడు తన శిష్యుడిని రంగంలోకి దించారు. తాను తెలంగాణకు చేసిన విధ్వంసాన్ని కొనసాగించాలని రేవంత్‌కు సూచనలు ఇచ్చిన చంద్రబాబు ఏ నాటికైనా ప్రత్యేక రాష్ట్రం ఎందుకు తెచ్చుకున్నామనుకునే విధంగా తెలంగాణను కష్టాల్లో చూడాలని అనుకుంటున్నారు. ఆయన జాడల్లోనే తెలంగాణ అస్తిత్వాన్ని మరుగుపర్చేలా రేవంత్ రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారు. లక్షలాది రైతుల ప్రయోజనకరమైన కాళేశ్వరం లాంటి ఒక పెద్ద ప్రాజెక్టుకు కేవలం తన అహంకారం కోసం రిపేర్లు చేయించటం లేదు. తెలంగాణ తల్లి విగ్రహ మార్పుతో కోట్ల మంది ప్రజల మనోభావాలను దెబ్బతీసిండు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు విలువనివ్వని రేవంత్‌రెడ్డి ఏనాటికైనా సమైక్య రాష్ట్రంలోని నాయకుల సంకలో ఉంటాడే తప్ప.. తెలంగాణ గల్లీల్లో కాదు.

ఇప్పటికైనా రేవంత్‌రెడ్డి తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడేలా, రైతుల గోసలను తీర్చేలా చర్యలు తీసుకోవాలి. రాజకీయ లబ్ధి కోసం కాకుండా కాళేశ్వరం ప్రాజెక్టుపై ఆధారపడి ఉన్న కోట్ల మంది రైతుల ప్రయోజనాల కోసం ఆలోచించాలి. ఏడాది పాలనలోనే ఇంత వ్యతిరేకత ఎదుర్కొంటున్న ముఖ్యమంత్రిత్రో ఇంకా మూడున్న రేండ్ల పాలనలో తెలంగాణ రైతులు ఎన్ని కష్టాలు పడాలో...

- రసమయి బాలకిషన్, మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే

ఇంకా మూడేండ్లు ఎట్లా బతుకుడో!

కాంగ్రెస్ పాలనలో రైతన్నలు కాడి వదిలేస్తున్నారు. రేవంత్ అసమర్థ పాలనలో సాగునీళ్లు రాక, పెట్టుబడికి పైసల్లేక దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు వ్యవసాయం చేయలేక చేతులెత్తేస్తున్నారు. సాగునీరు లేక ఇళ్లు విడిచి మళ్లీ వలసబాట పడుతున్నారు. తిండి గింజలకూ పంట చేతికొచ్చే పరిస్థితులు లేక పొట్ట చేత పట్టుకొని పట్టణాలకు, నగరాలకు బైలెల్లుతున్నారు.

ఇది ప్రతిపక్ష బీఆర్ఎస్ చెప్తున్న మాట కాదు.. స్వయంగా కాంగ్రెస్ సర్కారు ఇటీవల విడుదల చేసిన తెలంగాణ సామాజిక, ఆర్థిక నివేదిక-2025 చెప్తున్న వాస్తవం. కేసీఆర్ హయాంలో తెలంగాణలో 47.34 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి జీవించేవారు. కానీ, రేవంత్‌రెడ్డి పాలనలో ఈ సంఖ్య 42.7 శాతానికి పడిపోయింది. అంటే, గత 15 నెలల కాలంలో 4.64 శాతం మంది రైతులు కాడి వదిలేశారు. రేవంత్ ప్రభుత్వం చేసిన ఘనకార్యాల వల్ల రైతన్నలతో పాటు యావత్ తెలంగాణ పడుతున్న కష్టాలకు ఆ నివేదిక దర్పణం పట్టింది. పదేండ్ల క్రితం ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్, టీడీపీ పాలనలో తెలంగాణ ప్రాంతంలో సరిగ్గా ఇలాంటి పరిస్థితులే ఉండేవి. పరాయి పాలకులు తెలంగాణ సాగు సడుగులు విరగ్గొట్టారు. నీళ్లు, కరెంటు ఇవ్వకుండా రైతన్నల నడ్డివిరిచారు. నాడు తెలంగాణలో బంగారం లాంటి భూములన్నీ బీడువారాయి. తినేందుకు తిండి లేక, దూప తీర్చుకునేందుకు గుక్క నీళ్లు లేక ఆకలితో తెలంగాణ బిడ్డలు అలమటించారు. ఆకలికి తట్టుకోలేక బక్కచిక్కిన డొక్కలను చేత పట్టుకొని పొట్ట పోసుకునేందుకు వలసపక్షులు అయిపోయారు. ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్ పాలకుల నిర్వాకం వల్ల ఇలా మన బిడ్డలు చెల్లాచెదురై తెలంగాణ ఆగమైంది.

తెలంగాణ బిడ్డల కష్టాలను కండ్లారా చూసిన కేసీఆర్ ఉద్యమ జెండా ఎత్తి.. పట్టుబట్టి స్వరాష్ట్రం సాధించారు. సాధించిన రాష్ట్రాన్ని సుసంపన్నం చేశారు. ప్రాజెక్టులు కట్టి, పథకాలు పెట్టి ఎవుసాన్ని చక్కదిద్దారు. తెలంగాణలో స్వర్ణయుగం తీసుకువచ్చారు. భగీరథుడిలా పంతం పట్టి వలసలను వాపస్ తీసుకువచ్చారు. ముంబయి, దుబాయి బాటపట్టిన బిడ్డలు తెలంగాణకు తిరిగివచ్చి కాడి పట్టి, దుక్కి దున్నడం మొదలుపెట్టారు. బీడు భూముల్లో బంగారం పండింది. పుట్లకు పుట్లు వడ్లు పండాయి. కానీ, ఆ స్వర్ణయుగాన్ని కాంగ్రెస్ మార్పు కాటేసింది. రైతన్నను కాటగల్పింది. రేవంత్ అధికారంలోకి వచ్చిన నాటినుంచి తెలంగాణ రైతన్నలు ఆగమవుతున్నారు. సాగు నీళ్లు లేక కండ్ల నీళ్లు తీస్తున్నారు. పెట్టుబడికి పైసలు లేక అప్పుల పాలవుతున్నారు. సాగు చేద్దామంటే నకిలీ విత్తనాలు మోసైనయ్. కష్టనష్టాలకోర్చి పంట పండిస్తే కొనే దిక్కులేదు. బోనస్ బోగసైంది. రుణమాఫీ కోతలు, కొర్రీల పాలైంది. వందల ఫీట్లు బోర్లు వేస్తూ ఊరికో బోర్ల రామిరెడ్డి తయారైండు. కనుమరుగైపోయిన తెలంగాణ రైతన్నల కష్టాల పాటలు మళ్లీ జోరందుకున్నాయి. 'ఆరు అరకలు కట్టే పెద్ద రైతు కూడా అరకటెద్దులమ్మి అరువుకిచ్చిరి పొలము.. పేడ ఎరువు లేక భూమి సారము బోయే పొలము.. సూడ సక్కని నేల మోడు వారిపాయె.. తేమ ఒండు తగ్గిన భూముల సీమ కంపలు పెరిగేరా.. వయ్యారి భామచ్చి వరి మల్లే మొలిసిండి.. లొట్టపీసు సెట్లు గెట్టున పెరిగినయ్. తరి పొలం తగ్గింది వెరికలం మిగిలింది.. సెలకంతా మొరమై గులుకుగులుకైంది.. కలబంద జెమ్మండ్లురా తెలంగాణ కరువుకు గుర్తాయెరా...' అని గోరటి వెంకన్న శాసనమండలి సాక్షిగా పాటందుకోవడం రైతుల దీనస్థితిని తెలియజేస్తున్నది.

- సర్దార్ రవీందర్ సింగ్, కరీంనగర్ మాజీ మేయర్

పంటా.. పంటా.. ఎందుకు ఎండినవ్?

ఇనుగుర్తి సత్యనారాయణ
97046 17343

నిరుడు యాసంగి వరకు నిండుకుండల్లెక్క కనబడ్డ జలాశయాలు, వాగులు, చెరువులు నేడు ఎండిపోయి ఎండమావులయ్యాయి. నాడు ఎర్రటి ఎండల్లో చెరువులు మత్తళ్లు దుంకినయి. వరి పొలాల్లో చివరి మడి నిండిపోయి ఒడ్ల మీది నుంచి నీళ్లు ఒలికిపోయిన దృశ్యాలు కనిపించాయి. కానీ, నేడు పంట పొట్టకొచ్చిన దశలో నెర్రెలు వారిన నేల నోరు తెరిచి హృదయవిదారకంగా కనిపిస్తున్నది. కాలం లేక కరువొచ్చిందంటే కర్షకులు కన్నీళ్లు దిగమింగుకునేటోళ్లు. కానీ కాలం కరుణించింది. పుష్కలంగా వానలు పడితే రైతులు సంబురపడ్డరు. పులకించిపోయి పంటలు వేసుకున్నరు. పుట్లకొద్దీ దిగుబడి వస్తదని ఆశపడ్డరు. కానీ, కాంగ్రెస్ సర్కార్ రూపంలో కష్టం పొంచి ఉన్నదని గుర్తించలేదు. పుట్టెడు కాలమున్నా పట్టెడన్నం పెట్టే రైతన్నకు కష్టం తప్పడం లేదు. కండ్లు తెరిచి చూసేవరకు కరువు కరాళనృత్యం చేస్తున్నది.

గుంపుమేస్త్రి పని గిట్లనే ఉంటదా?:
ఎన్నికలకు ముందు అప్పటి పీసీసీ అధ్యక్షునిగా సీఎం రేవంత్ ఓ ఇంటర్వ్యూలో చెప్పిన మాటను ప్రజలు నేటికీ గుర్తుచేస్తున్నారు. 'మీరు సీఎం అయితా అంటున్నరు. మీకు పాలనలో అనుభవం లేదు కదా! ఎట్ల పాలన చేస్తరు?' అని విలేకరి అడిగారు. అందుకు రేవంత్ స్పందిస్తూ... 'సీఎం పదవి అనేది ఓ గుంపుమేస్త్రి పాత్ర వంటిది. ఎవరి పని వాళ్లు చేస్తర'న్నారు. ఇలా మాట్లాడటం గుంపుమేస్త్రి పనిని కూడా హేళన చేసినట్టే!

అనుభవం లేదు, ఆలోచన అసలే లేదు: సీఎం పదవి అంటే కుర్చీలో కూర్చొని ఎవరెలా చేస్తున్నారో చూడటం కాదు. ఎవరెవరు, ఏయే పనులు చేయాలో నిర్ణయించడం. నేడు, మరుసటి రోజు, వారం, నెల, ఏడాది, ఆ తర్వాత.. ప్రజల స్థితిగతులు, అవసరాలు, సమస్యలు, పరిష్కారాలపై నిరంతరం అధ్యయనం చేయడం. ఉదాహరణకు కేసీఆర్ హయాంలో ప్రాజెక్టులు, విద్యుత్తు, పంటల స్థితిగతులపై సమీక్షలు నిర్వహించేవారు. ఎక్కడ ఎంత వాన పడింది? ఏ ప్రాజెక్టులో నీటిమట్టాలు ఎంతున్నయి? ఏయే ఆయకట్టులో ఏయే పంటలు వేశారు? ఇంకా ఎన్ని తడుల నీళ్లు ఇవ్వాల్సి ఉన్నది? పంట చేతికి అందివచ్చేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి. అంటూ సమీక్షలు నిర్వహించిన తీరును చూశాం. దీన్నే నీటి నిర్వహణ పద్ధతి అంటారు. కానీ దీంట్లో రేవంత్ రెడ్డికి అనుభవం లేదు. ఈ దిశగా ఆలోచన అసలే లేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చీ రాగానే, సీఎం రేవంత్ కుర్చీలకు తెరతీశారు. కేసీఆర్ హయాంలో కట్టించిన కాళేశ్వరం ప్రాజెక్టును బద్నాం చేయడానికి.. అందులో నీళ్లు ఒడిసి పట్టలేదు. ఆ ఫలితం పల్లె పల్లెనా కనిపిస్తున్నది. తనను పట్టపగలు పట్టుకొని, తన దొంగతనాన్ని బయటపెట్టిన కేసీఆర్ మీద రగిలిపోవడమే రేవంత్ రెడ్డి ఏకైక ఎజెండాగా పెట్టుకున్నారు. అసలు పని పక్కన పెట్టి, కొసరు పని వెంట పడ్డారు. ఆ ఫలితమే ఇప్పుడు కనబడుతున్నది. నాడు ఎండకాలం కూడా మత్తళ్